క థా ని క

# కాంప్లిమెంటరీ

వి. వి. సోమయాజి

'నాటకమంటే యీ నాటకమే చూడాలి. ఈ ఛాన్సు పోతే మళ్ళా దొరకదు.' అన్నాడు వెనకనించే వచ్చిన వెంట్రామయ్య పేవ్‌మెంటుమీద నన్నాపి. 'కాకినాడలో ఆరు ప్రదర్శనాలు ఇచ్చారు. బెజవాడలో నాలుగు ప్రదర్శనాలూ, విజయనగరంలో అయిదూ, బందర్లో నాలుగూ ప్రదర్శనాలిచ్చేరు. బందర్లో పురజనులంతా కలిసి మళ్ళా ప్రదర్శించమని కోరుతున్నారుట!...' ఇంకా, యింకా చెప్పుకుపోతున్నాడు.

ఎంత కొత్తవాళ్లతోనైనాసరే ముందువెనుక చూసుకోకుండా చొరవతీసుకుని మాట్లాడే స్వభావం కలవాడవడంచేత వెంకట్రామయ్య అంటే నాకు గౌరవమైన భావం కలగక పోవడం వాస్తవమే. మా ఇద్దరికీగల పరిచయం కూడా చాలాతక్కువ. అలాంటప్పుడతని చొరవచూస్తే అనుమానించవలసి వస్తుంది. నిజానికిది చూడవలసిన నాటకమని నాక్కూడా తెలుసును. కాని జేబుకి అప్పుడే కన్నం పడిందెలాగా అని ఆలోచిస్తున్నాను. అదేం ఖర్మమో ఇటువంటివన్నీ నెలాఖర్నే వస్తాయి కూడాను. సరే, తప్పించుకునే ఉద్దేశంతో, 'టిక్కట్లు చూస్తే మనకందుబాట్లో లేవే' అన్నాను.

'నీ కెందుకు అదంతా నామీద వదిలెయ్యి, బ్రదర్!'

"చచ్చేంరా" అనుకున్నా మనస్సులో. డబ్బు పారేస్తే టిక్కట్లు తను తెస్తానంటాడు కాబోలు. అరటిపండొల్చి చేతులో పెట్టినట్లు సుబోధకంగా చెప్తేనే కాని ఈ ఘటం వదిలేట్టు లేదు. ప్లేటు తిరగెయ్యక తప్పదనుకున్నాను. "అహహ! అదికాదు. మీరుమాత్రం ఆ తోపులాటలో నలిగిపోయి టిక్కట్లు పుట్టించగలరా అని.

"ఆ భారం నామీద వెయ్యమన్నానుగా. ఈ ఛాన్సు వదిలిపెట్టకూడదు. ఈ నాటకం కంట్రాక్టరు మనకు కావలసినవాడు. చెరొక కాంప్లిమెంటరీ పట్టుకొచ్చేసే పూచీనాది. నువ్వు మాత్రం రావడానికి సిద్ధంగా ఉండు" అన్నాడు కాలరు సర్దుకుంటూ.

"నేనొస్తే నా వెనక మరో ఇద్దరున్నారు. అయినా, ఎందుకులెండి అన్నాను" వెధవను మానం పీక్కుతింటూ ఉండడచేత.

"అరె! నువ్వింకా పెరటి తోవనే ఉన్నావే మరేం ఫరవాలేదు. నువ్వు బయల్దేరు నేను కూడా మీతోనే ఉంటానుగా. నాలుగు కాంప్లిమెంటరీలు తెస్తాను, సరా? సమయం వచ్చిందిగనక చెప్తున్నాను. నాలుగు కాదు, నలభై తెమ్మన్నా తేగలననుకో. కంట్రాక్టరుకీ మనకీ అంత జోస్తీ తెలుసా?"

ఇంక యిది వదిలిపెట్టే రకం కాదనుకున్నాను. ఈ ఫ్రీ బేరాలతో నాటకాలకీ సినీమాలకీ వెళ్ళడమంటే నా కసలే తలనొప్పి. నా ఆత్మ గౌరవానికి భంగకరం అనిపిస్తుంది. నేను వెళ్ళడమే తటస్థిస్తే టిక్కట్టు కొని లోపల కాలు పెట్టవలసిందే! అది నా మతమనుకున్నా సరే, మరేమనుకున్నా సరే. కాని చిక్కల్లా ఇక్కడే వచ్చింది. నిజానికిది చూడవలసిన ప్రదర్శనమే అయినా పూర్తిగా చిక్కిపోయిన పర్సు వెనకడుగు వేయించింది. వెంకట్రామయ్య గట్టిగా పట్టుపట్టడం చేతనూ, వడ్డించేవాడు తనవాడే నన్నట్లు ధైర్యంగా చెప్తూండడంచేతనూ నా ఆశయాలకు విరుద్ధమైన కాంప్లిమెంటరీతో వెళ్ళడానికి సమ్మతిని తెలియపర్చక తప్పలేదు. అయినా కాస్త బెట్టుసరి చేశా.

'మీరు యిన్నిసార్లు పిలుస్తూన్నా, రానని చెప్పడం మోటుగా ఉంటుంది. ఏనా ఊరికే వచ్చిందని యింతమంది బయలుదేరడం సమం

జనం కాదేమో! అదీకాక టిక్కెట్టు కొనండే చూడ్డం నాకలవాటులేదు. క్షమించాలి' అన్నా అతని జవాబు కెదురుచూస్తూ.

'ఛీ. ఛీ! అలా అనుకోడమెందుకు? నేను రమ్మంటున్నాను గాని, నీ అంతట నువ్వు బయలుదేరుతున్నావు గనుకనా? మీరు ముగ్గురూ తప్పకుండా రావలసిందే. హాలు కెదురుగా ఉన్న చెట్టుక్రింద కలుసుకుందాం. అరగంట ముందుగానే వస్తారుకదూ? మీకోసం యెదురు చూస్తూ ఉంటాను. నేను వెళ్ళనా?'

నేను 'అలాగే' అన్నట్లు బుర్ర ఊపడం తప్ప యేమీ చెప్పలేకపోయాను. అతను కొంత దూరం వెళ్లేవరకూ అక్కడే నిల్చుని తరువాత యింటిదారి పట్టేను.

నిర్ణయించుకున్న ప్రకారం ఆట అరగంటకు మొదలు పెడతారనగానే శ్రీమతితోనూ, మరదలుతోనూ కలిసి హాలు కెదురుగా ఉన్న చెట్టుక్రిందికి చేరాను. ఇంకా వెంకట్రామయ్య వచ్చిన జాడేమీలేదు. మావాళ్లు యిద్దరూ పక్కా గంటసేపు చేసుకున్న మేకప్ అంతా వ్యర్థ మవుతుందేమోనని దిగులుపడ్డం మొదలెట్టేరు. ఏ నిమిషానికైనా రాకపోతాడా అని దిక్కులుచూస్తూ కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతున్నాను, అక్కడి కక్కడే. వెంకట్రామయ్య యింతకుముందే వచ్చి లోపల కంట్రాక్టరుతో ఉన్నాడేమో అని అనుమాన మొచ్చింది. ఈ ఆలోచన తట్టగానే. మావాళ్ళిద్దర్నీ కదలకుండా ఆ చెట్టుక్రిందే నిల్చోమని ఆజ్ఞాపించి, నేను గేటువైపు బయలుదేరాను. ముందు కెళ్తూన్న కొద్దీ కాళ్ళలో వేగంమందగిస్తూంది. ఆగేటు కిరువైపులా గున్న యేనుగుల్లాగున్నారు-యిద్దరు ద్వారపాలకులు. లోపలికివెళ్ళే ప్రతివాడినీ పరీక్షించి మరీ ప్రవేశపెట్టున్నారు. వాళ్ళను చూసేసరికి యీ ఆలోచనక్కూడా అంతరాయం కలిగింది. గుంపులు గుంపులుగా లోపలికి మనుష్యులు పోతూంటే వాళ్ళనుచూసి అసూయా, నా మీద నాకే అసహ్యమూ కలిగాయి. ఎంత చూసినా మిత్రుని అంతు లేకపోవడంచేత కాళ్ళీడ్చుకుంటూ యథాస్థానం చేరేను.

ఇంతలో నాకు బాగా పరిచితుడైన మరో మిత్రుడు ప్రదర్శనానికి వెడుతూ నన్ను చూసి ముందుకు సాగుతున్న కాళ్లకి బ్రేక్ వేశాడు. పోనీ, వేశాడయ్యా, నా ప్రక్కనున్న ఆడవాళ్లని చూసైనా, చూసీ చూడనట్లు ముందుకు సాగిపోవాలా? అబ్బే! అలా అయితే అతని మొ(న) గాడితన మేముంది?

"నాటకానికా యేమిటి, బయల్దేరావ్?" అన్నాడు. నేనున్న పరిస్థితిలో అతనికేం జవాబు చెప్పాలో తట్టలేదు.

"ఓ స్నేహితునికోసం ఆగాన్లే" అన్నా. ముఖాన్ని రెండోవైపు త్రిప్పుకుంటూ,

అంతలో వదిలే ఘటంకాదది. "పోనీ, టిక్కెట్లయినా తీసుకున్నావా? తీసుకోకపోతే త్వరగా తీసుకో. మళ్ళా దొరకవు."

"అవును. దొరకవేమో త్వరగా వెళ్ళి తీసుకో. మేం వస్తాంలే" అన్నా, ఎల్లాగో అల్లా మమ్మల్ని వదిలిపెడితే చాలు అనుకుంటూ.

దాంతోటి అతను వెళ్ళిపోయేడు. గట్టు మీదినుంచి నీళ్ళలోకి వచ్చిన చేపకు కలిగినంత విశ్రాంతి కలిగింది నాకు. ఏ పరిస్థితుల్లో ప్రతి వ్యక్తీ, తనకు పరిచితుడైన మరోవ్యక్తి కనపడకుండా ఉండాలని వాంఛిస్తూ ఉంటాడో, సరీగా అదే సమయంలో తెలిసిన వ్యక్తి తారసపడడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఇది చాలామందికి అనుభవమే!

ఇంకా నాటకం ప్రారంభించడానికి కొద్దిగా వ్యవధి ఉన్నందువల్ల ఆకాలంకూడా శాంతంగా గడపి తిరుగుముఖం పడదామని తీర్మానించుకున్నా. మేమునిల్చున్నస్థలమే ఒక రంగస్థలమైపోయింది. ప్రదర్శనానికి పోని జనసముదాయాన్ని మేము ఆకర్షించేమల్లే ఉంది. ఎవరికి తోచినట్లు వాళ్లు పరామర్శించి వెళ్తున్నారు.

"బూట్ పాలిష్, సార్!" అంటూ ఓ కుర్రాడు మీదకొచ్చాడు.

"తాజా శనగలూ, కాలక్షేపం బఠాణీలూ" అంటూ మరొకడు ప్రదక్షిణం చేసి వెళ్ళిపోయాడు.

"రిక్షా తెమ్మంటారా?" అన్నాడు, మరో గరుత్మంతుడు,

"ఓ, ఇక్కడున్నారా?" అన్న పరిచిత కంఠం వినిపించింది మరోవైపునించి.

అటు తిరిగా. "అమ్మయ్య!" అనుకున్నా అప్పటికైనా కనబడ్డ వెంకట్రామయ్యను చూసి.

"కాంప్లిమెంటరీలు తెచ్చారా ?" అన్నా, ప్రకాశంగా.

"లేదు. అవసరంలేదు." అన్నాడు గొంతు సవరించుకొంటూ.

"ఏం?"

"ఏంలేదు. మీరు నాతోరండి. ఎదురుగా వెళ్ళి కంట్రాక్టరుగారితో మాట్లాడేస్తా. మనకి కాంప్లిమెంటరీలూ అక్కరలేదు, గింప్లిమెంటరీలూ అక్కరలేదు. రండి" అన్నాడు ముందుకు దారితీస్తూ. అప్రమత్తులై పహరా కాస్తూన్న జయ విజయుల్లో ఒకడు అతని ఛాతీమీద చెయ్యిపెట్టి వెనక్కి నెట్టేడు.

"ఉండవయ్యా! ముందు మీ మేనేజర్ని చూడాలి." వెనక్కి తగ్గుతూనే అన్నాడు వెంకట్రామయ్య.

"ఇప్పుడాయన్ను చూడ్డానికి వీల్లేదు."

"ఏం? ఎంచేత?"

"ప్రదర్శనం ప్రారంభం అయింది."

"అయినప్పటికీ చూసితీరాలి."

"కాదంటూంటే ఏమిటిది ? ఆయన్ని ఇప్పుడే చూడవలసినంత రాచకార్య మేమిటి ముంచుకొచ్చింది?"

"రాచకార్యం కనుకనే లోపలికి వెళ్లడం. ఆయన నా స్నేహితుడు. ఆయనతో ఒక అర్జంటు విషయం మాట్లాడాలి. నేను వెళ్ళడానికి వీల్లేకపోతే ఆయన్నే తీసుకురా ఇక్కడికి."

అక్కడున్న ఒకడు వెళ్ళి మేనేజర్ని పిల్చుకొచ్చాడు. నున్నగా దువ్విన గిరజాలజుట్టూ, చేతిలో పొన్నుకర్రా, రెండుగజాల కైవారం నల్లగా, దుక్కలాగా చూస్తే హడలగొట్టించేలా, మేనేజరుహోదాకి తగ్గట్లుగా అన్నాడు. ఎంతలేదన్నా 200 పౌన్లు చులాగా తూగుతాడు.

"ఎవరయ్యా నువ్వు?" అని అతను వస్తూనే చేసిన గర్జనకి మా మిత్రుడి వెన్నెముక పట్టు తప్పింది.

"నన్నే ఎరుగరా?" అన్నాడు ధైర్యంచేసి కాలరు సర్దుకుంటూ.

"నువ్వేం గవర్నరువా?"

"మరి..."

"ఏం కావాలి. త్వరగా తేల్చవయ్యా!"

"ఆరోజు మనిద్దరం రైల్లో కలుసుకున్నాం"

"చాలామందిని చాలా సార్లు రైల్లో కలుసుకున్నాను... అయితే ఏమంటావ్?"

"అక్కడ మనిద్దరికీ పరిచయం కలిగింది.

"నేను మీ నాటకం చూడ్డం మీరు చాలా సంతోషమన్నారు."

"ఓహో! అలాగా. సరే, లోపలికెళ్లండి."

"అహ! మావాళ్లుకూడా ముగ్గురున్నారు."

"బలే బాగుందే! ఇదేదో సామెత చెప్పినట్లుంది. మిమ్మల్ని రమ్మంటే బంధుమిత్రపరివార సహితంగా రమ్మని అర్థమా?"

అతనలా అంటూంటే బుర్రమీద వెంట్రుకలన్నీ ఒక్కటొక్కటే రాలిపోతున్నట్లనిపించింది నాకు.

"సరే... వాళ్లెక్కడ" అన్నాడు ఆఖరికి.

"ఇరుగో" అని వెంకట్రామయ్య మమ్మల్ని చూపిస్తూంటే నేను తలవాల్చేను. ఈ నాటకం చూడ్డానికి చుట్టుప్రక్కల ఉన్న వందలాది బుర్రలు మావైపు తిరిగాయి. మాబుర్రలు నేలవైపు తిరిగాయి.

"సరే. అంతా లోపలికి పదండి." అని అనుమతి నిచ్చేడు యజమాని. అప్పటికే నాటకం ఆరంభ మయింది. హాలు జనంతో క్రిక్కిరిసి ఉంది. ఒక లావాటి మనిషి దారి చూపుతూ మమ్మల్ని తీసికెళ్ళి ఒక మూల కూర్చోపెట్టేడు. మధ్యలో అడ్డువచ్చినందుకు విసుక్కున్న ప్రతి ప్రేక్షకుని దీవనలూ మాకు తగిలేయి. పరాభవంతోనే బాధపడుతూ హాల్లో కూర్చున్నాం. పెద్ద ఫీటు చేసిన వాడిమాదిరి మా మిత్రుడు మీసం మెలేశాడు.

నాటకమంతా అయినతర్వాత యింటికొస్తూ దారిలో "ఎలాగుంది నాటకం?" అన్నాడు మిత్రుడు.

"అసలు కథ ఏమిటి?" అన్నా.